క్లుప్తంగా

ధర్నా వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి ధనుంజయ రావు

సీతానగరం: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 29న నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర, జిల్లా కార్యదర్శుల పిలుపు మేరకు మండల ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు టి. గౌరు నాయుడు, పోల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిమిత్తం ముద్రించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, నాగూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మెయింటెనెన్స్ పనులు జరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 2గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి.శంకరరావు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భారీ అన్న సమారాధన



అమ్మవారి ఆలయం నుంచి భోగం తీసుకువస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: దసరా ఉత్సవాల సందర్భంగా కోటదుర్గమ్మ ఆలయ వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి విరాళం అందించారు. శుక్రవారం ఆమె కుటుంబ సభ్యుల పేరుతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి అన్నదానం చేశారు. స్వయంగా ఎమ్మెల్యే కళావతి భక్తులకు తన చేతుల మీదుగా అన్నదానం చేయడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాన ఆలయంలో కోటదుర్గమ్మకు భోగం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెలమల మన్మధరావు, మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

కురుపాం: స్థానిక రావాడ రోడ్డులోని కోటి జంక్షన్‌లో వెలసిన కోటదుర్గమ్మ తల్లి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు ఆరో రోజు శుక్రవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


మహిళా సంఘానికి నిలిచిన నిధుల మంజూరు



బంగారమ్మ సంఘ సభ్యులకు ఆసరా నిధులు మంజూరైన ధ్రువపత్రం అందజేత

కొమరాడ: మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ కందివలస బంగారమ్మ మహిళా సంఘానికి సాంకేతిక లోపంతో మూడేళ్లుగా నిలిచిన నిధులు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కృషితో మంజూరై బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. మొత్తం రూ.3.36లక్షలు ఒక్కసారిగా బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. దీంతో రాజ్యలక్ష్మిపురం సచివాలయం వద్ద వెలుగు సిబ్బంది ఆ సంఘానికి బ్యాంకు సంబంధిత వివరాల ధ్రువపత్రాన్ని శుక్రవారం అందజేశారు. దీంతో మహిళా సంఘం సభ్యులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత నీటి పథకం పరిశీలన



తాళ్లడుమ్మలో రక్షిత పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లడుమ్మ గ్రామంలో రక్షితనీటి పథకం, సంపద సృష్టి కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు శుక్రవారం తనిఖీ చేసారు. రూ.4లక్షలతో నిర్మించిన 5వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మినీ రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించి, దాని పనితీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నీటిని వృథా చేయరాదని, కుళాయి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి గ్రామంలో పారిశుద్ధ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

అందరికీ ఆరోగ్య భాగ్యం

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందరికీ ఆరోగ్యభాగ్యం కలిగించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నూకలవాడలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో అందరి ఆరోగ్యం బాగుపడాలని కోరుకుంటున్నామన్నారు. ఈ పథకం ద్వారా ఇంటిముందుకే వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ అప్పలరాజు, వైద్యాధికారులు, సిబ్బంది, వి.వెంకటరమణ, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలోని కాశీపేటలో తహసీల్దార్ ఎన్వీ రమణ, సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో చిన్న పిల్లలు, గైనిక్, నేత్ర స్పెషలిస్ట్ డాక్టర్లతో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం పాల్గొన్నారు.ముందుగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఉచితవైద్య శిబిరంలో పాల్గొన్న రోగుల వివరాలను తెలుసుకుని డాక్టర్లు, నిర్వాహకులు అందిస్తున్న సేవల గురించి ప్రశ్నించారు. అలాగే ఐసీడీఎస్ పీఓ సుగుణకుమారి,ఎస్ఓ పూర్ణిమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌లో వస్తువుల తయారు, అందించే పోషకాలను, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు వారు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మామిడి బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ, సర్పంచ్ టి.ధనుంజయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ ధనంజయరావు మిల్క్ సొసైటీ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు,పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎన్వీ రమణ, మాజీ జెడ్పీటీసీ వెంకటప్పలనాయుడు, సత్యం మాస్టారు, అంటిపేట, పణుకుపేట సర్పంచ్‌లు జి.తిరుపతిరావు, బంకురు పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బి.శ్రీహరి, శ్రీకాంత్, ఎంఈఓ ఎంవీ రమణ, సచివాలయ ఉద్యోగులు వైద్యాధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సీతానగరం: రోగి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



బలిజిపేట: నూకలవాడలో ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం మండలంలో..

పార్వతీపురంటౌన్: ప్రతి ఒక్క కుటుంబానికి ఉచితంగా వైద్యసేవలు అందిస్తూ ఆరోగ్య భరోసా కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని నర్సిపురం–2 సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. క్యాంపులో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ మీ అందరి యోగ క్షేమాలు చూసుకుంటున్న సీఎం జగన్‌కి పూర్తి మద్దతు ఇచ్చి వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బలగ నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి.కృష్ణమూర్తి, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, స్థానిక సర్పంచ్ చెరుకుబిల్లి బంగారమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వెంపల గురురాజు, నాయకులు తెర్లి రామస్వామి, రెడ్డి అప్పలస్వామి, భూతాల వెంకటరమణ, కోట సంజీవినాయుడు, ఓలేటి మణిభూషణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తహసీల్దార్, ఈఓపీఆర్డీ, వైద్య శాఖ అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి

బలిజిపేట: వచ్చేనెల 1వ తేదీన నిర్వహించనున్న సామాజిక బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో శుక్రవారంసమావేశం నిర్వహించారు. బస్సుయాత్రకు ముందుగా ఈనెల 23వ తేదీన పార్వతీపురంలో పార్టీనేతలతో ముఖ్య సమావేశం ఉన్నందున నాయకులు, గృహసారథులు, పార్టీ అభిమానులు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండలశాఖ మహిళా అధ్యక్షురాలు ఎం.దుర్గేశ్వరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి వెలమవీధిలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న రోడ్డును ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం పరిశీలించారు. వెలమవీధిలో గతంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల విజ్ఞప్తి మేరకు మంజూరు చేసిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సందర్భంగా ఆ వీధి మహిళలు ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, టి.ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సదస్సును విజయవంతం చేయాలి

సీతానగరం: పార్వతీపురంలో ఈనెల 23న జరగనున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, పార్టీలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయ పాఠ్యాంశంపై చర్చ



ప్రకృతి వ్యవసాయ పాఠ్యాంశంపై చర్చలో పాల్గొన్న బృందం సభ్యులు

గరుగుబిల్లి:

ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ సహకారంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలోని పూర్వ ప్రాథమిక విద్య మొదలుకొని ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్య, యూనివర్సిటీ స్థాయి వరకు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి విద్యా ప్రణాళికను రూపొందించి, రచయితల వర్క్ షాప్‌లో తయారు చేసిన డ్రాఫ్ట్ సిలబస్ గురించి చర్చించినట్లు ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర కన్సల్టెంట్ డా.డి.పారినాయుడు శుక్రవారం తెలిపారు. పూర్వ ప్రాథమిక నుంచి ఉన్నత పాఠశాల వరకు రెగ్యులర్ సిలబస్‌కు అనుబంధంగా చేర్చవలసిన అంశాల గురించి, ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక మీద చర్చించారు. కార్యక్రమంలో రచయితలు నల్లా బాలకృష్ణ, మంచిపల్లి గోపినాథ్, చిత్రకారుడు తుంబలి శివాజీ పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ప్రణాళిక అమలు కోసం స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సహకారంతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేయవలసిందిగా కమిషనర్ పాఠశాల విద్యను కోరినట్లు పారినాయుడు తెలిపారు.

మత్స్యకార సంఘాలకు చేపపిల్లలు

బలిజిపేట:

మండలంలోని ఎనిమిది చెరువుల్లో 90వేల చేపపిల్లలను పెంపకానికి వేశామని మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి వై.శ్రీదేవి తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా సబ్సిడీ కింద సంఘాలకు చేపపిల్లలను ఇచ్చినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సంఘాలకు 60శాతం సబ్సిడీ, బీసీ సంఘాలకు 40శాతం సబ్సిడీ కింద వాటిని అందజేశామన్నారు. మండలంలోని బర్లి తామర చెరువులో 20వేలు, పలగర తామర చెరువులో 10వేలు, పెదపెంకిలోని కృష్ణసాగరంలో 34వేలు, అసిరిపోలు చెరువులో 2,500, నూకలవాడలోని భుక్తచెరువులో 12వేలు, గంగాడలోని మూడు చెరువుల్లో 10వేల చేప పిల్లలను విడుదల చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సచివాలయ సహాయక సిబ్బంది ఎ.కీర్తిప్రియ, శంకరరావు పాల్గొన్నారు.



చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న సిబ్బంది

సరస్వతీ దేవికి ఎమ్మెల్యేపూజలు

సీతానగరం:

మండలంలోని పలుగ్రామాల్లో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు చినభోగిలి గ్రామంలో గల దుర్గాదేవి గుడిలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సరస్వతీ దేవి అమ్మవారికి పూజలు చేసి, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కురమాన రాధ, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ జి బుజ్జి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మరిపివలసలో కుంకుమ పూజలు

మండలంలోని మరిపివలస దుర్గాదేవి ఆలయంలో మాజీ ఎంపీపీ బి.వరలక్ష్మి, ఉత్సవ కమిటీ ప్రతినిధుల పర్యవేక్షణలో సరస్వతీదేవికి శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రంవరకూ కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.



సీతానగరం: మరిపివలసలో అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

సరస్వతీదేవిగా దుర్గమ్మకు అలంకరణ

బలిజిపేట: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ఘనంగా పూజలు చేశారు. అందులో భాగంగా అజ్జాడ గ్రామంలో శ్రీ విజయదుర్గా ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించిన అర్చకులు భక్తులతో పూజలు చేయించారు.

సరస్వతీ దేవిగా దుర్గమ్మ

పార్వతీపురంటౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణం, మండలంలో వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనమిస్తూ భక్తులను అనుగ్రహిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తవలస నవదుర్గ ఆలయం, వెంకంపేట దుర్గాలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేసి మొక్కులు తీర్చుకున్నారు.

దుర్గమ్మకు వస్త్రాల సమర్పణ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలను సమర్పించారు.



బలిజిపేట: సరస్వతీదేవి అవతారంలో పూజలు అందుకుంటున్న దుర్గమ్మ



పార్వతీపురం టౌన్‌:సరస్వతీ దేవిగా నవదుర్గ

సరస్వతీదేవిగా పోలమాంబ



మక్కువ: సరస్వతీదేవి అలంకరణలో పోలమాంబ

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారు శుక్రవారం భక్తులకు సరస్వతిదేవి రూపంలో దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వందలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అక్షరాభ్యాసం చేసిన విద్యార్థులకు వడగళ్ల వేణు దంపతులు పెన్నులు, పుస్తకాలు అందించారు. అనంతరం శ్రీదేవి భాగవత ప్రవచనాలను పెంట సింహాచలం నాయుడు, యాళ్ల భాస్కరరావు వినిపించారు. అలాగే స్థానిక మజ్జిగౌరమ్మ ఆలయం, శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయం, గోపాలపురంలో దేవీ ఆలయం, ఎం.పాలికవలసలో రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మక్కువ: హోమంలో పాల్గొన్న భక్తులు

నిబద్ధతతో పనిచేయండి



వలంటీర్లకు నియామకపత్రాలు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, ప్రజాప్రతినిధులు

సాలూరు: వలంటీర్లు నిబద్ధతతో పని చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. మున్సిపాలిటిలో నూతనంగా నియమాకమైన వలంటీర్లకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, జేసీఎస్ కన్వీనర్ గిరి రఘు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు మున్సిపాలిటీకి

నిధుల వరద...

- మంత్రి రాజన్న కృషితో శరవేగంగా అభివృద్ధి పనులు
- మున్సిపాలిటీలో రూ. 3 కోట్లతో 79 పనులకు ప్రతిపాదనలు
- గడప గడపకు.. నిధులు రూ. 5.60 కోట్లతో 170 పనులు



వెంకటేశ్వర కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



మున్సిపాలిటీలోని బంగారమ్మ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన డ్రైనేజీ

సాలూరు: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు నిధుల వరద పారుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కోట్లాది రుపాయలతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు 20 లక్షల రుపాయలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. అయితే ఏజెన్సీ నియోజకవర్గాల్లో అదనపు నిధులు అవసరమని భావించిన ఉప ముఖ్యమంత్రి, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అందుకు గల కారణాలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రతి సచివాలయానికి అదనంగా మరో 20 లక్షలు చొప్పున మొత్తం 40 లక్షల రూపాయలను మంజూరు చేశారు. మున్సిపాలిటీలో 14 సచివాలయాల్లో 13 సచివాలయాలకు ముందుగా 91 పనులకు గాను 2 కోట్ల 60 లక్షల రుపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. కాగా ఇటీవల ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర మున్సిపాలిటీలోని 9వ సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తిచేయడంతో అన్ని సచివాలయాల్లో ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయింది. ఈ క్రమంలో మున్సిపాలిటీలో 3 కోట్ల రూపాయలతో 79 పనులు చేపట్టడానికి మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పనులు ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ జయరాం తెలిపారు. అలాగే 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధుల ద్వారా మున్సిపాలిటీలో దాదాపు 5 కోట్ల 60 లక్షల రుపాయలతో 170 పనులు చేపడతామని వివరించారు. ఇదిలా ఉంటే మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న పనులపై మంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఎప్పటికప్పుడు అధికారులు, స్థానిక నాయకులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సాలూరు బైపాస్ రోడ్డు పూర్తి చేయడం.. వంద పడకల ఆస్పత్రి నిర్మాణం.. టిడ్కో ఇళ్లు..కాకులతోట వద్ద బ్రిడ్జి నిర్మాణం.. అగ్రికల్చర్ ల్యాబ్, పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో మంత్రి రాజన్నదొరకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.